క్లుప్తంగా

లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి


అవగాహన కల్పిస్తున్న చొల్లేటి ప్రభాకర్

నల్లగొండ టౌన్ : గ్రూపు పరీక్షలకు పోటీ పడుతున్న యువత లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే అనుకున్న ఉద్యోగాలను సాధించవచ్చని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ సూచించారు. శనివారం నల్లగొండ పట్టణంలోని అప్పా స్టడీ సెంటర్‌లో యువతకు గ్రూపు పరీక్షలపై ఆయన అవగాహన కల్పించారు. తాను పట్టుదలతో లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివి 1984న ఐఏఎస్‌కు ఎంపికైనట్లు గుర్తు చేశారు. పట్టుదల, పోటీతత్వాన్ని అలవర్చుకుని చదవాల్సిన అవసరం ఉందన్నారు.

పాటి అనసూయకు నివాళి


నివాళులర్పిస్తున్న సుఖేందర్‌రెడ్డి తదితరులు

చిట్యాల: పట్టణానికి చెందిన మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు పాటి మాధవరెడ్డి, మోహన్ రెడ్డిల తల్లి అనసూయ(92) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం అనసూయ చిత్రపటానికి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, వనమా వెంకటేశ్వర్లు, బెల్లి సత్తయ్య, కోనేటి కృష్ణ, ఎస్‌కె.ఇబ్రహీం, జిట్ట భిక్షం పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

రామగిరి(నల్లగొండ): ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తిప్పర్తి మండలంలోని సర్వారం గ్రామానికి చెందిన రూపని సైదులు గతేడాది అక్టోబర్ 19వ తేదీన తిప్పలమ్మగూడెం శివారులో తన ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేయగా చోరీకి గురైంది. బాధితుడు శనివారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ డి. రాజు తెలిపారు.

వృద్ధులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని లతీఫ్‌సాబ్ గుట్ట వద్ద న్యాకంబాల శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సీహెచ్. లక్ష్మీబాయి కూతురు భవాని పుట్టిన రోజు సందర్భంగా వృద్ధులు, దివ్యాంగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రజని, సమాచార హక్కు సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బండమీది అంజయ్య, దాసోజు కృష్ణమాచారి, జాని, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాలకూరి అశోక్‌గౌడ్‌కు గౌడ సంఘం మద్దతు


సమావేశంలో మాట్లాడుతున్న కాశయ్యగౌడ్

నల్లగొండ టౌన్ : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన పాలకూరి అశోక్‌గౌడ్‌కు గౌడ సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నకిరేకంటి కాశయ్యగౌడ్ తెలిపారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశ్నించే గొంతుకను మండలి పంపించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల్లో అశోక్‌గౌడ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల శంకర్‌గౌడ్, బండారు గోవర్ధన్‌గౌడ్, మామిడి సత్తయ్యగౌడ్, వీరమళ్ల నాగరాజుగౌడ్, దశరథగౌడ్ పాల్గొన్నారు.

విశ్వకర్మ లెజెండ్రీ అవార్డుకు ఎంపిక


పెందోట సోము

నార్కట్‌పల్లి: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వ్యవస్థాపకుడు పెందోట సోము విశ్వకర్మ లెజెండ్రీ అవార్డుకు ఎంపికై నట్లు విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వ్యవస్థాపక అధ్యక్షుడు విశ్వానాథుల పుష్పగిరి శనివారం తెలిపారు. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఎనిమిదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత వేలు ఆనందచారి చేతుల మీదుగా సోము అవార్డును అందుకోనున్నట్లు తెలిపారు.

వానాకాలం సాగుకు సన్నద్ధం

- దుక్కులు సిద్ధం చేసుకుంటున్న రైతులు
- కేతేపల్లి మండల వ్యాప్తంగా 28వేల ఎకరాల్లో సాగు అంచనా
- వరి, పత్తి సాగుకే ప్రాధాన్యం
- విత్తనాల సేకరణలో కర్షకులు


కేతేపల్లిలో దుక్కులు సిద్ధం చేస్తున్న రైతులు


మూసీ ప్రాజెక్టులో పెరుగుతున్న నీటిమట్టం

కేతేపల్లి: రోహిణి కార్తె ప్రారంభం కావటంతో అన్నదాతలు వానాకాలం సాగు పనులు మొదలు పెట్టారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలపటంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. నిలకడ లేని వానలు కురుస్తున్నా మూసీ ఆయకట్టేతర ప్రాంత రైతులు పత్తి, కంది, పెసర తదితర పంటలను సాగు చేసేందుకు భూములను సిద్ధం చేస్తున్నారు. కురిసిన కొద్దిపాటి జల్లులకే ఎద్దుల అరకతో కొందరు, ట్రాక్టర్లతో మరికొందరు దుక్కులు దున్నుకుంటున్నారు. మరికొందరు గత ఏడాది సాగు చేసిన పత్తి, కంది కర్రలను తొలగిస్తున్నారు. ముందస్తుగా పొలం పాతం చేసుకున్న రైతులు విత్తనాల సేకరణలో మునిగిపోయారు.

పంట సాగు అంచనా

మండలంలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలో దాదాపు 28వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తారని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వరి 20,500 ఎకరాలు, పత్తి 7500 ఎకరాలు, కంది 15ఎకరాల్లో సాగులోకి రానున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. మూసీ నాన్ ఆయకట్టు గ్రామాల్లో ఈఏడాది మండలంలో రైతాంగం వర్షాధారంతో ఎక్కువగా పత్తిసాగు వైపే మొగ్గు చూపుతున్నారు. గత ఏడాది పత్తి సాగు చేసిన రైతులకు మంచి దిగుబడి రావటంతో పాటు మద్దతు ధర దక్కింది. గత ఏడాది ఫలితాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి పత్తి సాగుకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్లుగా కనిపిస్తోంది.

మూసీపై చిగురిస్తున్న ఆశలు

మూసీ నీటితో కేతేపల్లి మండలంలో దాదాపు 11వేల ఎకరాల భూముల్లో వరి సాగు కానుంది. ఈ ఏడాది ఏప్రిల్ 5వ తేదీ నాటికి ప్రాజెక్టులో నీటిమట్టం 618(గరిష్ఠ నీటిమట్టం 645 అడుగులు) అడుగుల కనిష్ఠ నీటిమట్టానికి పడిపోవటంతో వానాకాలం పంటకు నీటి విడుదలపై రైతులకు ఆశ లేకుండా పోయింది. అయితే గత 50 రోజుల నుంచి హైదరాబాద్ నగరంతో పాటు మూసీ ఎగువ, పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వస్తున్న ఇన్‌ఫ్లోతో ప్రాజెక్టులో నీటిమట్టం ఒక్కో అడుగు పెరుగుతూ 633 అడుగులకు చేరుకుంది. దీంతో ఆయకట్టుకు నీటి విడుదలపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జూన్ చివరి నాటికి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండినా వానాకాలం పంట సాగుకు నీటి విడుదలకు ఢోకా ఉండదని రైతులు ధీమాతో ఉన్నారు.కొందరు రైతులు మెట్ట దుక్కులు దున్ని వరినాట్లకు పొలాలను సిద్ధం చేస్తున్నారు.

సాగుకు సిద్ధమవుతున్నా..



"ఈఏడాది ఆరు ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నా. ఇటీవల కురిసిన వర్షాలకు దుక్కులు పాతం చేసి సాగుకు సిద్ధమయ్యా. ముందుగానే విత్తనాలు సైతం సేకరించి ఉంచాను. భారీ వర్షం కురిసిన వెంటనే విత్తనాలు వేస్తాము. అధికారులు పంటల పరిశీలనకు వచ్చి సాగులో సలహాలు, సూచనలు చేయాలి.

– బొల్క శివ, రైతు, కేతేపల్లి

వర్షం కురిసిన తర్వాతే విత్తనాలు వేయాలి



"తొలకరి వానలతో విత్తనాలు విత్తొద్దు. పెద్ద వర్షం పడితేనే లోతుగా పదునై భూమి చల్లబడుతుంది. సరిపడా వర్షాపాతం నమోదయ్యాకే పత్తి, కంది తదితర పంటలను సాగు చేయాలి. దుక్కులు దున్నుకునే సమయంలో, విత్తనాల సేకరణలో రైతులు జాగ్రత్తలు వ్యవహరిస్తే పంట దిగుబడి పెరిగే అవకాశముంది. విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణాల్లో తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలి.

–బి.పురుషోత్తం, ఏఓ, కేతేపల్లి

చట్టసభల్లో మున్నూరు కాపులకు ప్రాధాన్యం కరువు

- మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య


సమావేశంలో మాట్లాడుతున్న కొండ దేవయ్య

నకిరేకల్ : చట్టసభల్లో మున్నూరు కాపులకు ప్రాధాన్యత కరువైందని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ ఆవేదనవ్యక్తం చేశారు. నకిరేకల్‌లో శనివారం జరిగిన ఆ సంఘం నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని సంఘం ప్రచార పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. తెలంగాణలో ఏ ఎన్నికలు జరిగినా మున్నూరు కాపులు ముందు వరుసలో ఉండి పోటీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్నూరుకాపులకు పార్టీలకతీతంగా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సకినాల రవి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వెంకట నర్సయ్య, సంఘం ప్రతినిధులు పోతులు గిరి, పూల సైదులు, దొంతల అంజయ్య, పోతుల మల్లయ్య, రాంచంద్రయ్య, కందుల సోమయ్య, పోతుల రాజేష్, సంపత్, లచ్చయ్య, లగిశెట్టి వెంకన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వండి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులు మద్దతు ఇవ్వాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. నకిరేకల్‌లోని పీఆర్‌టీయూ భవన్‌లో శనివారం నకిరేకల్, కేతేపల్లి, శాలిగౌరారం మండలాల పీఆర్‌టీయూ సంఘం ఉపాధ్యాయులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో బీసీ ఫైనాన్స్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, ఆయా మండలాల పీఆర్‌టీయూ సంఘం అధ్యక్షులు కడారి అనిత, పున్న శ్రీనివాస్, కోమిటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మారుపాక నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నకు మద్దతు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీలా ప్రకటించారు. శనివారం సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. సమావేశంలో నాయకులు బొజ్జ చిన్న వెంకులు ,రాచకొండ వెంకట్‌గౌడ్, లగిశెట్టి శ్రీనివాస్‌లు, రామస్వామి, జగన్ పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి


మాట్లాడుతున్న చెరుకు సుధాకర్, చిత్రంలో బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్ తదితరులు

- బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్

నల్లగొండ టౌన్ : కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్, డాక్టర్ చెరుకు సుధాకర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక యాదవ సంఘం భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. బీసీ కుల గణన చేసిన తర్వాత బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఆ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే బీసీలంతా ఐక్యమై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. రిజర్వేషన్ల సాధనలో భాగంగా జూన్ 8న నిర్వహించే మహాధర్నాలో బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు లొడంగి గోవర్ధన్, దుడుకు లక్ష్మీనారాయణ, మైదాసు సంజయ్, కొండూరు సత్యనారాయణ, నేలపట్ల రమేష్, మామిడి పద్మ, పర్వతాలు, చంద్రయ్య, సుంకబోయిన శివకుమార్, పాడిశెట్టి అరవింద్, మునాస ప్రసన్నకుమార్, ఆనంద్‌గౌడ్, జి.దశరథ, వలకీర్తి శ్రీనివాస్, పగిళ్ల కృష్ణ, శివయాదవ్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తాం

- ఏడీఏ రామారావునాయక్


నకిరేకల్: సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ


నల్లగొండ : తనిఖీ చేస్తున్న ఏఓ శ్రీనివాస్


చండూరు : రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ

నకిరేకల్ : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే డీలర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఏడీఏ రామారావు నాయక్ హెచ్చరించారు. నకిరేకల్‌లోని రైతుయ వేదిక భవనంలో శనివారం విత్తన డీలర్లతో ఆయన సమావేశమై పలు సూచనలు చేశారు. వానాకాలం సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని కోరారు. రైతులు విత్తనాలు కొనుగోలు సమయంలో రశీదు తప్పని సరిగా ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో ఏఓ మహమ్మద్ జానీవియా, ఏఈఓ, బీటీఎంలు విక్రమ్, సందీప్, డీలర్ల సంఘ ప్రతినిధులు మురారిశెట్టి కృష్ణమూర్తి, శ్రీనివాస్, సైదులు, హనుమాన పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

నల్లగొండ అగ్రికల్చర్ : నాణ్యమైన బ్రాండెడ్ పత్తి విత్తనాలను మాత్రమే విక్రయించాలని, నకిలీ విత్తనాలను రైతులకు అంటకడితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం ఆయన పట్టణంలోని పలు విత్తనాల దుకాణాలను అకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాల ప్యాకెట్లు పరిశీలించి ప్యాకింగ్ తేది, గడువు ముగిసే తేదీలను పరిశీలించడంతో పాటుగా స్టాక్ రిజిస్టర్‌లను, విత్తన ప్యాకెట్ల విక్రయాల రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు దుకాణాలలోని పత్తి విత్తనాల ప్యాకెట్లను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. విధిగా రశీదులను పొందాలని, వాటిని సీజన్ ముగిసేంత వరకు భద్రపర్చుకోవాలన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

చండూరు : రైతులకు విత్తనాలు ఎమ్మార్పీకే విక్రయించాలని చండూరు ఏఓ రేవతి అన్నారు. ఆమె శనివారం చండూరు, గట్టుప్పల్ మండలాల్లో ఎరువుల దుకాణాలను తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓలు మౌనిక, నిఖిల్ కుమార్, నాగార్జున పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించుకోవాలి


చౌటుప్పల్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి

చౌటుప్పల్ : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో ఒకే చోట ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలను ప్రాంతాలవారీగా ఏర్పాటు చేయాలని మల్కాపురం ఎంపీటీసీ లు చిట్టంపల్లి శ్రీనివాస్, బోయ ఇందిరలు కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఆహార కల్తీపై అధికారులు దృష్టిసారించాలని కోరారు. పశువుల మేత కోసం గడ్డి కటింగ్ మిషన్లు తెచ్చుకున్న రైతులు ఆయా మిషన్లు వాడకపోయిన విద్యుత్ అధికారులు ఏ విధంగా కేసులు నమోదు చేస్తారని విద్యుత్ అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనలు మరోసారి పునరావృతం కావొద్దని సూచించారు. గ్రామాల్లో వందశాతం పన్నుల వసూలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ సందీప్‌కుమార్, వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి వార్షికోత్సవం

మర్రిగూడ: మండలంలోని మేటిచందాపురం పరిధిలో గల ఇందుర్తి గ్రామ బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగిలి లక్ష్మీప్రసన్నరవి, గణేష్, యాదగిరి పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న మాజీ సర్పంచ్ లక్ష్మీప్రసన్న

అధికారం కోల్పోయినా.. అహంకారం తగ్గలే

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న


సమావేశంలో మాట్లాడుతున్న మల్లన్న

మునుగోడు : అధికారం కోల్పోయినా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు అహంకారం మాత్రం తగ్గలేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విమర్శించారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయించాలని కోరుతూ శనివారం మునుగోడులో నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతిని ఎండగట్టినందుకు తనపై అక్రమంగా 56కేసులు బనాయించి జైలుకు పంపించిందని పేర్కొన్నారు. అయినా దాడులు, కేసులకు భయపడకుండా ప్రజల పక్షాన పోరాడినట్లు వివరించారు. తనను శాసనమండలికి పంపించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లకంటి సత్యం, డీసీసీబీ డైరక్టర్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, జెడ్పీటీసీ సురేందర్, వెంకటేశ్వర్‌రెడ్డి, చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, పబ్బు రాజు గౌడ్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నకు మేధావుల వేదిక మద్దతు


నల్లగొండ : మాట్లాడుతున్న మల్లేశ్వర్


చిట్యాల: ఓటర్లను అభ్యర్థిస్తున్న నాయకులు

నల్లగొండ: కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు పూలే మేధావులు, విద్యావంతుల వేదిక సంపూర్ణ మద్దతు ఇస్తుందని పూలే ఆశయ సాధన వేదిక అధ్యక్షుడు సంగాని మల్లేశ్వర్ తెలిపారు. శనివారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాలు నిరుద్యోగులకు అన్యాయం చేశాయని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు పట్టభద్రులు బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో సైదులుగౌడ్, ఎస్‌కే సర్దార్, డా.ఎల్లయ్య, వంగాల సుధాకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కేతేపల్లి: సీపీఎం రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి చింతపల్లి లూర్దు మారయ్య తెలిపారు. శనివారం కేతేపల్లిలో నిర్వహించిన సీపీఎం ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో పార్టీ నాయకులు ఏళ్ల అశోక్‌రెడ్డి, వీరబోయిన సోదయ్య, అవ్వారి కిరణ్, బండమీది అంజయ్య, లింగయ్య పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నకు మద్దతుగా ప్రచారం

చిట్యాల: కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతుగా చిట్యాలలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు శనివారం పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, ట్రస్మా రాష్ట్ర నాయకుడు కందాల పాపిరెడ్డి, కౌన్సిలర్స్ రెముడాల లింగస్వామి, బెల్లి సత్తయ్య, ఏర్పుల పరమేష్, రెముడాల మధు, బొబ్బల రాంరెడ్డి, సిలివేరు శేఖర్, బూరుగు కృష్ణయ్య, నాగంపల్లి కిషోర్ పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్ : ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలింపించాలని మున్నూరుకాపు మహాసభ జిల్లా అధ్యక్షుడు కంచనపల్లి జవహర్‌లాల్, ప్రధాన కార్యదర్శి నాగులంచి స్వామి పిలుపునిచ్చారు. శనివారం స్థానికంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు.సమావేశంలో నాయకులు కాటం సునీల్‌కుమార్,మేకల వెంకన్న, తోకల శ్రీనివాస్, నేతి రఘుపతి, నల్లగొండ అంజనేయులు, తోకల వెంకటకిషన్, నేతి ఉమామహేశ్వర్, సుంకరి రాజారాం, ఇమ్మడిఉదయ్‌కుమార్, పంతులు శ్రీనివాస్, రామగిరి వెంకన్న పాల్గొన్నారు.

రామగిరి(నల్లగొండ): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ సీపీఎం తిప్పర్తి మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం అనిశెట్టి దుప్పలపల్లి అంతయ్యగూడెం గ్రామపంచాయతీలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పట్టభద్రులను అభ్యర్థించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నన్నూరి వెంకటరమణారెడ్డి, భీమగాని గణేష్, జంజిరాల ఉమా, కన్నెబోయిన సైదులు, మహేష్, నందిని, మైల శ్రీను, నకిరెకంటి శివ, తిరుమల మధు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

చండూరు : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని చండూరు మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్ పట్టభద్రులను కోరారు. శుక్రవారం ఆయన చండూరు, అంగడి పేటలో ప్రచారం నిర్వహించారు.

తండ్రికి మద్దుతుగా కూతురు ప్రచారం


ప్రచారం చేస్తున్న ప్రేమేందర్‌రెడ్డి కూతురు తేజస్విని

నల్లగొండ టూటౌన్ : వరంగల్ ఖమ్మం నల్లగొండ పట్టభద్రుల ఎంఎల్‌సీ ఉప ఎన్నికల అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కూతురు తేజస్వినిరెడ్డి స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఎన్జీ కాలేజి మైదానంలో వాకర్స్‌నుకలిసి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. అదే విధంగా ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులు,స్టడీ సర్కిల్స్, మెడికల్ ఏజెన్సీలలో ప్రచారం చేసి ప్రేమేందర్‌రెడ్డికి ఓట్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా నాయకులు నేవర్సు నీరజ, కూతురు విజయ, హైమావతి పాల్గొన్నారు.

చిట్యాల: బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి పట్టభద్రులంతా మద్దతునివ్వాలని చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రశ్నించే గొంతుక రాకేష్ రెడ్డిని గెలిపిస్తేనే నిరుద్యోగుల, ఉద్యోగుల పక్షాన శాసనమండలిలో పోరాటం చేస్తాడని పేర్కొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

చండూరు(గట్టుప్పల్) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ గట్టుప్పల్ మండల కేంద్రంలో ఆ పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి చిలువేరు దుర్గయ్య, కర్నాటి రవితేజ, మండల శ్రవణ్, కొంగరి పాండు, రాజు , కర్నాటి ప్రవీణ్, చెరిపల్లి ప్రవీణ్, కుండే శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే.. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా

- స్వతంత్ర అభ్యర్థి రాఘవేందర్

మర్రిగూడ: వరంగల్- ఖమ్మం- నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో తనను అధిక మెజారిటీతో గెలిపిస్తే నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్వతంత్ర అభ్యర్థి ఐతగోని రాఘవేందర్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు నిరుద్యోగులను నిలువునా మోసం చేస్తున్నాయని విమర్శించారు. ప్రలోభాలకు లొంగకుండా తనకు ఓటు వేసి గెలిపిస్తే ప్రభుత్వంపై కొట్లాడి జాబ్ క్యాలెండర్ విడుదల చేయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో అశోక్‌గౌడ్, గణేష్‌గౌడ్, నర్సింహ, నిమ్మల స్వామి, బోరెం నవీన్‌రెడ్డి, ఐతగోని విష్ణు, ప్రవీణ్, శ్రీనివాస్, రాకేష్, జయంత్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నకిరేకల్ : నకిరేకల్ మండంలోని ఆర్లగడ్డగూడెం సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 7గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సాయి గణేష్ తెలిపారు. ఈసబ్ స్టేషన్ పరిధిలో తాటికల్, మంగళపల్లి, చిన్నసూరారం, నర్సింహాపురం, ఎన్ఆర్‌గూడెంలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సోషల్ ఆడిట్ నిర్వహించాలి

మిర్యాలగూడ టౌన్ : మున్సిపల్ అభివృద్ధి, సుపరిపాలనపై సోషల్ ఆడిట్ (సామాజిక తనిఖీ) నిర్వహించాలని ఆర్టీఐఏ సహాయ, సలహా రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రుషికేశ్వర్‌రాజు, చిలుమల కొండలు కోరారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటి వరకు మున్సిపాలిటీకి ఎన్ని నిధులు వచ్చాయో, ఎంత ఖర్చు చేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉప్పుతల మహేష్, మంద శేఖర్, విజయ్, అజయ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న రుషికేశ్వర్‌రాజు

బిల్ కలెక్టర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

కొండమల్లేపల్లి : విద్యుత్ శాఖలో పని చేస్తున్న బిల్ కలెక్టర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం విద్యుత్ బోర్డ్ డీఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య మాట్లాడుతూ ఎలక్ట్రిసిటీ బోర్డ్‌లో 25ఏళ్లుగా బిల్ కలెక్టర్లు పనిచేస్తూ చాలీచాలని వేతనాలతో పూట గడవక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ నాయకులు బిజిలి లింగయ్య, బిల్ కలెక్టర్ల సంఘం నాయకులు టి.లక్ష్మయ్య, పర్వతరెడ్డి, వెంకటమ్మ, కలీం బాబా, నాగేష్, జగన్, ప్రవీణ్ పాల్గొన్నారు.